కథ

# అనుకోకుండా అలా..

మాచిరాజు కామేశ్వర రావు
9000080396



"అత్తయ్య గారూ.. మీరుకూడా మాతో రావచ్చు కదా! ఆ కొత్త మాల్ చాలా బాఉందిట. అందులో అయిదు స్క్రీన్‌లు కూడా ఉన్నాయట. కాసేపు మాల్‌లో తిరిగి సినిమా చూసి వద్దాం'' బాల్కనీలో కూర్చుని కింద గ్రౌండ్‌లో ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తున్న రాజేశ్వరి.. కోడలి మాటలు విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

''నేను రానులే తల్లీ! నువ్వూ అబ్బాయి వెళ్లి రండి'' అంటూ కుర్చీ లోనుంచి లేచింది రాజేశ్వరి.

''ఏం అంటోంది అమ్మ? వస్తోందా?''.. టక్ సవరించుకుంటూ వచ్చాడు సాగర్.

''ఎంత చెప్పినా రానంటున్నారు''.. నిష్టూరంగా అన్నది శృతి.

''మీరిద్దరూ వెళ్లి రండిరా.. వచ్చేవారం నన్ను శివాలయానికి తీసుకువెళ్తే సంతోషంగా వస్తాను'' నవ్వింది రాజేశ్వరి.

''తప్పకుండా తీసుకుని వెళ్తాను. తలుపు వేసుకో!'' అంటూ భార్యతోపాటు వెళ్లిపోయాడు సాగర్.

తలుపు వేసుకుని, మళ్లీ వచ్చి బాల్కనీలో కూర్చుంది రాజేశ్వరి. కాసేపు పిల్లల ఆటలు చూసి హాల్‌లోకి వచ్చి గంటసేపు చాగంటి వారి ప్రవచనాలు విని, రెండు పుల్కాలు తిని, టేబుల్ సర్దుతూ ఉండగా కాలింగ్ బెల్ మోగింది. రాజేశ్వరి వీధి గదిలోకి వెళ్లి బయట లైటు వేసి.. కిటికీ కర్టెన్ పక్కకు జరిపి చూసింది. గుమ్మంలో సాగర్, శృతి..

రాజేశ్వరి ఆశ్చర్యపోతూ తలుపు తెరిచింది.

''అప్పుడే వచ్చేసారేమిటి? సినిమాకి వెళ్లలేదా?''.

శృతి ఏమీ మాట్లాడకుండా జేవురించిన మొహంతో విసురుగా తమ గదిలోకి వెళ్లి తలుపు మూసుకుంది.

నిశ్శబ్దంగా లోపలికి వచ్చి వీధి తలుపు మూశాడు సాగర్.

''ఏమైందిరా? శృతి ఏమిటి అదోలా ఉంది? ఇంత త్వరగా వచ్చేసారేమిటి?'' అంతా అయోమయంగా ఉంది రాజేశ్వరికి.

''ఏమో? మాల్‌లో కాసేపు తిరగగానే ఇంటికి వెళ్లిపోదామంది. కారణం చెప్పదు. కారులో కూడా ఉలుకూ పలుకూ లేకుండా కళ్లు మూసుకుని కూర్చుని ఉంది''.

''ఒంట్లో బాగో లేదేమో! ఒకసారి వెళ్లి చూడు!''.

మూసి ఉన్న తలుపు తోసుకుని గదిలోకి వెళ్లాడు సాగర్. మంచం మీద పడుకుని ఉంది శృతి.

''ఏమిటీ.. పడుకుండి పోయావు? భోజనం చేయవా? అసలు ఏమైంది నీకు?''..

మంచం మీద ఆ వైపు తిరిగి పడుకుని ఉన్న శృతిను దుటి మీద చేయి వేసి చూస్తూ.. ఆత్రుతగా అన్నాడు సాగర్.

''జ్వరం కానీ రాలేదు కదా!?''.

శృతి ఏడుస్తోంది.

కంగారు పడి పోయాడు సాగర్.

''ఎందుకు ఈ ఏడుపు? కడుపు నొప్పిగా ఉందా?''.

సాగర్ మాటలు విని కంగారుగా గదిలోకి వచ్చిన రాజేశ్వరికి.. ఏడుస్తున్న శృతిని చూసి కాలూ చేయీ ఆడలేదు.

''అమ్మా శృతీ! ఏమైంది తల్లీ! నాకు చెప్పు'' శృతి పక్కనే మంచం మీద కూర్చుంటూ, ఆమె మొహాన్ని తన వైపు తిప్పుకొంది రాజేశ్వరి.

ఏడుపుతో శృతి మొహం అప్పటికే ఉబ్బి పోయింది. శృతి వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది.

''ఎందుకమ్మా.. ఈ ఏడుపు? ఏమైంది నీకు?''.

శృతి నుంచి ఎటువంటి సమాధానం లేదు.

''ఒరేయ్.. నువ్వొకసారి బయటికి వెళ్లు!'' అని, కొడుకు వెళ్లాక..

''నాకు అర్థమైంది. ఆడవాళ్ల ప్రాబ్లెమ్ అనుకుంటా! పొత్తి కడుపులో నొప్పిగా ఉందా? డాక్టర్ దగ్గరికి వెళ్దామా? చెప్పు తల్లీ! నువ్విలా బాధ పడుతూ ఉంటే నేను చూడలేను'' పమిట చెంగుతో శృతి చెక్కిళ్ల మీది కన్నీళ్లు తుడుస్తూ అంది రాజేశ్వరి.

కష్టం మీద ఏడుపు కంట్రోల్ చేసుకుని..

''నా ఒంట్లో బాగానే ఉంది'' అంది శృతి చిన్నగా.

''మరి.. ఎందుకిలా ఏడుస్తున్నావు?''.

అత్తగారు అలా అడగగానే మళ్లీ దుఃఖం పొంగుకు వచ్చింది శృతికి.

''అలా ఏడుస్తూ ఉంటే బాధ ఇంకా ఎక్కువ అవుతుంది. నా తల్లివి కదా.. చెప్పు ఏం జరిగింది?''.. శృతి చుబుకం పట్టుకుంది రాజేశ్వరి.

''మాల్‌లో జనం విపరీతంగా ఉన్నారు. ఏమిటో అన్నీ ఊరికే పంచుతున్నట్లుగా జనం ప్రతిచోటా ఎగబడి పోతున్నారు. అదే అదనుగా భావించి ఒకడు.. ఒకడు..''

''ఆ ఒకడు.. వాడేం చేశాడు?''.

''నా నడుం, గుండెలు నొక్కేశాడు'' భోరున మళ్లీ ఏడ్చేసింది శృతి.

క్షణంపాటు రాజేశ్వరి నోరు పెగల లేదు. కాస్సేపటికి తనని తాను సర్దుకుని..

''అప్పుడే చెప్పు తీసి వాడి చెంప చెళ్లుమనిపించాల్సింది'' అంది కోపంగా.

''ఆ పాడు పని చేయగానే, వాడు గబగబా జనంలో కలిసి పోయాడు. మళ్లీ కనిపించ లేదు''.

''ఇది అబ్బాయి చూడలేదా?''.

లేదన్నట్లుగా తల ఊపింది శృతి.

''ఆయన ఐస్‌క్రీమ్ కోసం కౌంటర్ దగ్గర ఉన్నారు. ఏమీ చేయలేని నా అశక్తతకి దుఃఖం పొంగుకు వచ్చింది. ఒళ్లంతా తేళ్లు జెర్రులు పాకుతున్న ఫీలింగ్. అందుకే ఆయనను తీసుకుని వెనక్కి వచ్చేశాను. జరిగిన దానికి నామీద నాకే అసహ్యంగా ఉంది. ఒళ్లు మైల పడినట్లుగా ఉంది. వాణ్ని ఏమీ చేయలేక పోయినందుకు దుఃఖం..''

మళ్లీ దుఃఖం పొంగుకు వచ్చింది శృతికి.